సాక్షి
కృష్ణాజిల్లా
ఆదివారం । 29 । జూన్ । 2025



నిత్యాన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రి: దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదానానికి హైదరాబాద్‌కు చెందిన పి.వేణుగోపాల్ శనివారం ఆలయ ఈవో శీనానాయక్‌కు రూ.1,16,116 విరాళాన్ని అందజేశారు.



చట్టాలపై అవగాహన అవసరం

చట్టాలపై అవగాహన అవసరమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గుట్టాల గోపి అన్నారు. బందరు జెడ్పీ కన్వెన్షన్ హాలులో శనివారం న్యాయసేవల శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. -8లో▸



దుర్గమ్మకు సారె సమర్పణ

ఇంద్రకీలాద్రి: ఆషాఢ మాసోత్సవాల్లో భాగంగా మూడో రోజు శనివారం ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి దుర్గమ్మకు సారెను సమర్పించారు.

ధాన్యం సొమ్ములేవి బాబూ?

- కృష్ణాజిల్లాలో రూ.12.08 కోట్లు బకాయి
- లక్ష్యాన్ని చేరని ధాన్యం సేకరణ
- సేకరించిన ధాన్యం సొమ్ము కోసం అన్నదాతల ఎదురుచూపు
- ఖరీఫ్ సాగు పనులు మరింత భారం

అప్పల కోసం అన్నదాతల తిప్పలు



గొడవర్రులో రబీ సీజన్‌లో ధాన్యం సేకరణ (ఫైల్)

కంకిపాడు: ధాన్యం సేకరించిన 48 గంటల్లో ధాన్యం సొమ్ము రైతు ఖాతాకు జమ అవుతుందని కూటమి ప్రభుత్వం చేసిన ప్రచారం కేవలం ప్రచారార్భాటంగానే మిగిలింది. ధాన్యం సేకరణ పూర్తయి నెల రోజులు కావస్తున్నా వందలాది మంది రైతులు ధాన్యం సొమ్ములు అందక అవస్థలు పడుతున్నారు. మరో వైపు ఖరీఫ్ సీజన్ ముంచుకొస్తోంది. పొలాలు అదును తప్పక ముందే వరి నాట్లు వేసేందుకు సన్నద్ధమవుతున్నారు. అయితే సాగుకు అవసరమైన పెట్టుబడులకు నానా పాట్లు పడుతున్నారు. చేతిలో చిల్లిగవ్వ లేక అప్పుల కోసం పరుగులు పెట్టాల్సిన దుస్థితి నెలకొంది.

లక్ష్యాన్ని చేరని ధాన్యం సేకరణ

కృష్ణాజిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్‌లో 1.51 లక్షల హెక్టార్లలో, రబీ సీజన్‌లో 12,285 ఎకరాల్లో వరి సాగు జరిగింది. ఖరీఫ్ సాగులో మిగులు ధాన్యం సేకరణతో పాటు రబీ సీజన్‌కు 75 వేల మెట్రిక్ టన్నులు ధాన్యం సేకరణ లక్ష్యంగా నిర్దేశించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సివిల్ సప్లయిస్ అధికారులు జిల్లా వ్యాప్తంగా ఉన్న రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ చేపట్టారు. 8570 మంది రైతుల నుంచి రూ 127.97 కోట్లు విలువైన 54,304.34 మెట్రిక్ టన్నులు మాత్రమే ధాన్యం సేకరించినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోలేక పోవటంలో కూటమి సర్కారు నిర్లక్ష్యంతో పాటుగా అధికారుల అలసత్వం కూడా అధికంగా ఉంది.

దళారులు, మిల్లర్లు ఏకమయ్యారు

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం దళారీ వ్యవస్థకు ఆస్కారం లేకుండా రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజ కొనుగోలు చేసేలా సమర్థంగా చర్యలు తీసుకుంది. ధాన్యం సేకరణ నుంచి మిల్లుకు తరలించే వరకూ ఎలాంటి అవరోధాలు తలెత్తకుండా సమర్థంగా వ్యవహరించింది. ప్రకృతి విపత్తును సైతం ఖాతరు చేయకుండా ధాన్యం సేకరించి రైతుకు మేలు జరిగేలా చర్యలు తీసుకుంది. దీనికి పూర్తి భిన్నంగా కూటమి సర్కారు వ్యవహరించిందంటూ అన్నదాతలు వాపోని రోజు లేదు. రబీతో పాటు ఖరీఫ్ మిగులు ధాన్యాన్ని సేకరించాలని లక్ష్యం నిర్దేశించుకున్నా ఆచరణలో మాత్రం లక్ష్యం చేరలేకపోయింది. రవాణా వాహనాలను సమకూర్చటంలో జాప్యం జరిగింది. ఆఖరికి గోనె సంచుల కొరత రైతులను వెంటాడింది. చివరికి ప్రభుత్వం ఏర్పాటుచేసిన రైతు సేవా కేంద్రాలకు కాకుండా దళారులకు 75 కిలోలు బస్తా రూ.1400కే తెగనమ్ముకుని సొమ్ము చేసుకున్న పరిస్థితులు ఈ సీజన్‌లో జిల్లాలో చోటుచేసుకున్నాయి. మరో వైపు దళారులకు మిల్లర్లు తోడై సహకారాన్ని అందించటంతో రవాణా వాహనాలు, సంచులు దళారులకే ముందుగా చేరుకోవటంతో రైతులు దళారులకే పంటను అమ్ముకోవాల్సి వచ్చింది.



గొడవర్రులో వరి నాట్లకు సిద్ధం చేస్తున్న పొలం

బకాయి సొమ్ములకు ఎదురుచూపులు

ధాన్యం విక్రయించిన 48 గంటల్లో రైతుల ఖాతాలకు సొమ్ము జమ చేస్తామని కూటమి ప్రభుత్వం చెప్పింది. ధాన్యం సేకరణ తొలి నాళ్లలో సొమ్ము బాగానే జమయింది. ప్రస్తుతం ధాన్యం సేకరణ నిలిచింది. అయితే సుమారు నెల రోజులకు పైగా ధాన్యం సొమ్ముల కోసం జిల్లాలో రైతులు ఎదురుచూపులు చూస్తున్నారు. రబీలో 8570 మంది రైతుల నుంచి రూ.127.97 కోట్ల విలువైన ధాన్యం సేకరించారు. 7308 మంది రైతులకు రూ.115.14 కోట్లు జమ చేశారు. కానీ ఇంకా 767 మంది రైతులకు రూ.12.08 కోట్లు అందాల్సి ఉంది. నెల రోజులకుపైగా ఆ రైతులు అధికారుల చుట్టూ, బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

రైతులను ఖూనీ చేస్తున్న సర్కారు



రైతులను కూటమి సర్కారు ఖూనీ చేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా వెయ్యికోట్లకు పైగా ధాన్యం సొమ్ము బకాయిలు ఉన్నాయి. ధాన్యం సొమ్ము ఇవ్వకుండా రైతులను ఇబ్బందులకు గురిచేయటం అన్యాయం. ఖరీఫ్ సాగుకు పెట్టుబడులు సమకూర్చుకోవటానికి రైతులు అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. ఏడాది లోపు అప్పులు చెల్లిస్తే సున్నా వడ్డీ వర్తిస్తుంది. ప్రభుత్వ అలసత్వం వల్ల సొమ్ములు అందక రుణాలు చెల్లించే స్థితి లేదు. రైతులకు జరుగుతున్న నష్టానికి ప్రభుత్వం బాధ్యత వహించాలి. ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన అధికారుల తీరు సరిగా లేదు.

–మాగంటి హరిబాబు,
రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఏపీ కౌలురైతు సంఘం

ఖరీఫ్‌లో అప్పల తిప్పలు

ఓ వైపు ధాన్యం సొమ్ము అందక ఇబ్బందులు పడుతూ మరో వైపు ఖరీఫ్ సాగు ముంచుకొస్తుండటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. సాగు ఆలస్యం అయితే పొలాలు అదును తప్పుతాయనే భయం వెంటాడుతోంది. గతంలో సాగు ఆరంభానికి ముందే పెట్టుబడి సాయం అందేది. అలాంటిది ఈ ప్రభుత్వంలో వరుసగా రెండో ఏడాది కూడా పెట్టుబడి సాయం అందలేదు. దీంతో పంట పెట్టుబడుల కోసం అందినకాడికి అప్పులు సమకూర్చుకుని సాగు పనుల్లో నిమగ్నమవుతున్నారు.

న్యూస్‌రీల్

దోషరహిత ఓటర్ల జాబితాకు సహకరించాలి

డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): దోషరహిత, తప్పులు లేని ఓటర్ల జాబితా రూపకల్పనలో రాజకీయ పక్షాలు అధికారులకు పూర్తి సహకారం అందించాలని, అర్హులైన యువ ఓటర్లను నమోదు చేసుకునేలా ప్రోత్సహించాలని డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. కలెక్టరేట్‌లోని ఏవీఎస్ఎన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజకీయ పక్షాలు ప్రస్తుత ఓటర్ల జాబితాలో మరణించినా, శాశ్వతంగా వలస వెళ్లినా వారి పేర్లను బీఎల్‌వోకు తెలియజేయాలన్నారు. ఓటరు జాబితాలో మార్పులు, ఓటరు కార్డులో ఏవైనా తప్పులు ఉంటే వాటికి సంబంధించి ఫారం–8 నమోదు చేసి, సరిచేసేందుకు సహకరించాల్సిందిగా కోరారు. జిల్లాలో ఫారం 6, ఫారం 7, ఫారం 8 అర్జీలకు సంబంధించిన ప్రస్తుత వివరాలను తెలియజేసి సమాచారాన్ని రాజకీయ పక్షాలకు అందించారు. సమావేశంలో రాజకీయ పక్షాల ప్రతినిధుల సందేహాలను డీఆర్‌వో నివృత్తి చేశారు. సమావేశంలో ఎన్నికల సెల్ డెప్యూటీ తహసీల్దార్ ఏఎస్ఆర్ గోపాలరెడ్డి, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

నూతన యాగశాలను అందుబాటులోకి తీసుకురండి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై రాధాకృష్ణుల విగ్రహం వద్ద నూతనంగా నిర్మించిన యాగశాలను త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని దుర్గగుడి ఈవో శీనానాయక్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆలయ ప్రాంగణంలోని యాగశాలను శనివారం ఈవో శీనానాయక్, ఇంజినీరింగ్ అధికారులు, వైదిక కమిటీ సభ్యులు పరిశీలించారు. దాత సంగా నరసింహారావు నిర్మించిన నూతన యాగశాలను త్వరగా అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నూతన యాగశాలను యుద్ధప్రాతిపదికన సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈవో వెంట వైదిక కమిటీ సభ్యుడు కోట ప్రసాద్, ఈఈ కోటేశ్వరరావు డీఈ అశోక్, ఇతర ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

సచివాలయాల ఇంజినీరింగ్ సహాయకుల బదిలీలు



విజయవాడరూరల్: ఉమ్మడి కృష్ణాజిల్లాలో గ్రామ సచివాలయాల్లో ఇంజినీరింగ్ సహాయకులుగా పని చేస్తున్న వారికి బదిలీల ప్రకియ శనివారం ప్రారంభమైంది. విజయవాడ లోని పంచాయతీరాజ్ సూపరింటెండెంట్ ఇంజినీరు కార్యాలయంలో బదిలీలను నిర్వహిస్తున్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలోని సుమారు 700 మంది ఇంజినీరింగ్ సహాయకులకు కాల్ లెటర్స్ పంపి అయిదు సంవత్సరాల పాటు ఒకే చోట పనిచేస్తున్న వారిని తప్పకుండా బదిలీ చేయాలనే ప్రభుత్వ ఆదేశాల మేరకు బదిలీలు చేస్తున్నారు. పంచాయతీరాజ్ ఎస్ఈ రమణ, ఈఈ రమేష్, కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీనివాస్ తదితరులు బదిలీల ప్రక్రియలో పాల్గొన్నారు. బదిలీ అయిన వారు వెంటనే విధుల్లో చేరాలని చెబుతున్నారు.

నేడు దుర్గమ్మకు తెలంగాణ బంగారు బోనం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు ఆదివారం తెలంగాణ నుంచి బంగారు బోనం సమర్పించనున్నారు. హైదరాబాద్‌లోని శ్రీ భాగ్యనగర్ మహంకాళీ జాతర అమ్మవారి బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో బ్రాహ్మణ వీధిలోని జమ్మిదొడ్డి నుంచి ఊరేగింపుగా ఆలయానికి చేరుకుంటారు. సుమారు రెండు వందల మంది బేతాళ నృత్యాలు, తీన్‌మార్ డప్పులతో తెలంగాణ సంప్రదాయాన్ని ప్రతిబింబిస్తూ ఊరేగింపు జరుగుతుంది. అమ్మవారికి బంగారు బోనంతో పాటు పట్టుచీర, పూలు, పండ్లు, పూజా సామగ్రిని సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజలు సుఖశాంతులతో ఉండాలని ప్రతి ఏటా ఆషాఢ మాసంలో అమ్మవారికి బంగారు బోనం సమర్పిస్తారు.

ప్లాస్టిక్ ప్రత్యామ్నాయ ఉత్పత్తుల తయారీపై అవగాహన

అధికారులకు కలెక్టర్ లక్ష్మీశ సూచన



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయ ఉత్పత్తుల తయారీపై అవగాహన కల్పించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. యువత, మహిళలు కొత్త పారిశ్రామిక యూనిట్లను ఏర్పాటు చేయడం ద్వారా, పారిశ్రామికవేత్తలుగా ఎదగొచ్చని, ఈ విషయంపై సమన్వయ శాఖలు అవగాహన కల్పించి ప్రోత్సహించాలని సూచించారు. ఏపీ కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన ఇగ్నైట్ స్టాళ్లను కలెక్టర్ లక్ష్మీశ సందర్శించారు. ప్లాస్టిక్ ఇయర్‌బడ్స్, క్యాండీ స్టిక్స్, పాలీస్టరిన్ (థర్మోకోల్) వస్తువులు వంటి నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులు, ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా చెక్క స్పూన్లు, గుడ్డ సంచులు, కంపోస్టబుల్ ప్లాస్టిక్ ఉత్పత్తులు తదితరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణానికి మేలుచేసే వివిధ ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉందని, వీటిని ఉత్పత్తి చేసే యూనిట్లను ఏర్పాటుచేసి తమతో పాటు పది మందికి ఉపాధి కల్పించేలా ఔత్సాహికులను ప్రోత్సహించాలన్నారు. ఇప్పటికే అటువంటి పరిశ్రమలను విజయవంతంగా నడుపుతున్న వారితో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని పూర్తిగా అరికట్టడంతో పాటు ఎకో ఫ్రెండ్లీ ఉత్పత్తుల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గాలిలో పీఎం10 సూక్ష్మ ధూళికణాల స్థాయిని విశ్లేషించేందుకు ఉపయోగించే ఆధునిక సాంకేతికత పరికరాలను కూడా కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ వెంట జిల్లా ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ పి.శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో ఆన్‌లైన్ మోసాల అదుపు

- నేరాలు తగ్గించేందుకు పోలీసులు సమష్టిగా కృషి చేయాలి
- ఆధునిక టెక్నాలజీని ఉపయోగించుకోవాలి
- సురక్ష 360 ప్రారంభోత్సవంలో హోంమంత్రి వంగలపూడి అనిత



సురక్షా 360 కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం సభలో ప్రసంగిస్తున్న హోంమంత్రి అనిత

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఇటీవల ఆన్‌లైన్ మోసాలు బాగా పెరిగాయని, మనకు తెలియకుండానే బ్యాంక్ ఖాతాలో డబ్బులు కూడా దోచే పరిస్థితులున్నాయని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో పోలీసులు నేరాలను అరికట్టాలని ఆదేశించారు. ఎన్టీఆర్ జిల్లాలోని ప్రతి గ్రామం, ప్రతి వీధి సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉండాలనే లక్ష్యంగా ఏర్పాటు చేసిన సురక్షా 360ను హోంమంత్రి అనిత శనివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రతి ఆలయం, చర్చి, మసీదులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా సురక్ష డివైస్ ఏర్పాటు, 28 స్టేషన్ అధికారులకు సురక్ష డివైస్ కిట్‌లు అందజేశారు. జిల్లాలోని ప్రజల భద్రత కోసం 321 గ్రామాలు, 20 మండలాలు, నాలుగు మునిసిపాలిటీలు, ఒక నగరపాలక సంస్థలోని 64 వార్డులు మొత్తం 1211 చదరపు కిలోమీటర్లు అంతా నిరంతర సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉండేలా చర్యలు తీసుకోనున్నారు. దాతల సహకారంలో ఎన్టీఆర్ జిల్లా పోలీసులు ఒక నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టారు. విజయవాడ గుణదలలోని వెన్యూ కల్యాణ మండపంలో జరిగిన సురక్ష 360 ప్రారంభోత్సవంలో పాల్గొన్న హోం మంత్రి అనిత మాట్లాడుతూ.. ఎన్టీఆర్ జిల్లా కమిషనరేట్ టెక్నాలజీ వినియోగంలో ముందంజలో ఉందన్నారు. ఎక్కడ నేరం జరిగినా, ట్రాఫిక్ స్తంభించినా, అసాంఘిక శక్తుల అడ్డాలను టెక్నాలజీ ద్వారా గుర్తించి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అస్త్రం యాప్ ద్వారా ఎప్పటికప్పుడు ప్రజలకు ట్రాఫిక్ సమస్యలు లేకుండా చేస్తున్నారని, ఈ యాప్‌ని విశాఖ పోలీసులు స్ఫూర్తిగా తీసుకుని అమలు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రతి గ్రామంలో 4 సీసీ కెమెరాలు

ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు మాట్లాడుతూ జిల్లాలో ప్రతి గ్రామంలో కనీసం నాలుగు సీసీ కెమెరాలు ఉండేలా చర్యలు తీసుకున్నామని, ఎమ్మెల్యే సుజనా చౌదరి సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ.30 లక్షలు విరాళంగా ఇచ్చారన్నారు. కార్యక్రమంలో ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు గద్దే రామ్మోహన్, బొండా ఉమా, సుజనాచౌదరి, కొలికపూడి శ్రీనివాసరావు, శ్రీరాం రాజగోపాల్, కలెక్టర్ జి.లక్ష్మీశ, డీసీపీ సరిత తదితరులు పాల్గొన్నారు.

అగ్రి క్లినిక్‌ల స్థాపనకు ఉచిత శిక్షణ

గన్నవరంరూరల్: ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు అగ్రి క్లినిక్‌లు స్థాపించేందుకు జాతీయ వ్యవసాయ విస్తరణ కేంద్ర సంస్థ సహకారంతో మహిళా పారిశ్రామిక వాడ సీఈడీ ప్రోగ్రాం ద్వారా 45రోజుల పాటు ఉచిత శిక్షణ ఏర్పాటు చేసినట్లు నోడల్ అధికారి పి.శోభారాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ, వ్యాపార రంగాల్లో రాణించాలనుకునే యువతీ, యువకులకు వ్యవసాయ భూమిని అభివృద్ధి, ఆధునికీకరణ చేసుకోవడానికి కావాల్సిన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఈ శిక్షణ అందజేస్తుందన్నారు. దీని ద్వారా ఆదాయాన్ని గణనీయంగా పెంచుకునేందుకు నైపుణ్యం నేర్చుకోవచ్చని చెప్పారు. అగ్రికల్చర్, హార్టీకల్చర్, సెరికల్చర్, పశు వైద్య విజ్ఞానం, చేపల పెంపకం, బయోటెక్నాలజీ, అగ్రి ఇంజినీరింగ్, ఫారెస్ట్రీ, ఫుడ్ అండ్ న్యూట్రీషన్, బీజెడ్‌సీ, హోమ్ సైన్స్, ఎన్విరాన్మెంటల్ సైన్స్ కోర్సులలో పోస్ట్ గ్రాడ్యుయేషన్, గ్రాడ్యుయేషన్, డిప్లొమా చదివిన పట్టభద్రులకు ఈ ఉచిత శిక్షణ అవకాశం కల్పిస్తున్నట్లు వివరించారు. 45 రోజుల పాటు ఇచ్చే శిక్షణలో ఉచిత భోజనం, వసతి ఏర్పాటు చేస్తారని తెలిపారు. శిక్షణ అనంతరం ఎంపికైన వారికి ధ్రువీకరణ పత్రం అందజేయటంతో పాటు జాతీయ వ్యవసాయం విస్తరణ కేంద్ర సంస్థ, ఎలీప్ సీఈడీ సహకారం ఉంటుందన్నారు. వివరాలకు 94412 66769 నంబర్‌ను సంప్రదించాలని చెప్పారు. జూలై 8వ తేదీన శిక్షణ కార్యక్రమం ప్రారంభమవుతుందని, ఈలోగా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు వ్యవసాయం, వ్యాపార రంగాల్లో అగ్రి క్లినిక్ స్థాపించేందుకు శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవాలని శోభారాణి సూచించారు.

1 నుంచి గాంధీహిల్ ప్రవేశ సమయంలో మార్పులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): గాంధీ హిల్ ప్రవేశ సమయాల్లో మార్పులు చేసినట్లు ఆ సంస్థ మేనేజర్ యు.రవితేజ తెలిపారు. జూలై ఒకటి నుంచి ఉదయం 10 నుంచి రాత్రి 8:30 గంటల వరకు సందర్శకులకు గాంధీహిల్ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. (ప్రస్తుతం మధ్యాహ్నం 3 గంటల నుంచి మాత్రమే అందుబాటులో ఉంటోంది.) మంగళవారం సెలవు దినమని తెలిపారు.మరిన్ని వివరాలకు 91105 51952 నంబరులో సంప్రదించవచ్చనని వివరించారు.

విద్యార్థుల భవితను తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే

- కృష్ణా విశ్వవిద్యాలయంలో ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు
- ఉపాధ్యాయులకు స్వయంగా శిక్షణ ఇచ్చిన కృష్ణా కలెక్టర్ బాలాజీ



ప్రధానోపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్న కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ, చిత్రంలో వీసీ రాంజీ తదితరులు

కోనేరుసెంటర్: విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే గురుతర బాధ్యత ఉపాధ్యాయులకే ఉంటుందని, అటువంటి ఉపాధ్యాయులు తమ బాధ్యతను సక్రమంగా నెరవేర్చాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ప్రధానోపాధ్యాయులకు సూచించారు. కృష్ణాజిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో శనివారం కృష్ణా విశ్వవిద్యాలయంలోని అల్లూరి సీతారామరాజు ఆడిటోరియంలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు వ్యక్తిత్వ వికాసం, ప్రేరణ తరగతులను నిర్వహించారు. ఈ తరగతులకు కలెక్టర్ హాజరై ఉపాధ్యాయులకు స్వయంగా శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒక దేశం అభివృద్ధి చెందాలంటే ఆ దేశంలో ఉన్న వనరులు ఉంటే సరిపోదని సరైన ప్రజలు కూడా ఉండాలన్నారు. ఆ ప్రజలను మంచి వారిగా తీర్చిదిద్దాలంటే ఒక ఉపాధ్యాయునికే సాధ్యమవుతుందన్నారు. హను మంతుడికి తన శక్తి ఏమిటో తనకు తెలియదని, అలాగే విద్యార్థులలో ఉండే సృజనాత్మక శక్తిని గుర్తించి ప్రేరణ ఇవ్వాల్సిన బాధ్యత ఉపాధ్యాయు లదేనన్నారు. విద్యార్థుల జీవితాలను వారి తలరాతలను మార్చగలిగే శక్తి సామర్థ్యం ఒక్క ఉపాధ్యాయుడికే ఉంటుందన్నారు. ఈ సందర్భంగా జపాన్, ఉక్రెయిన్ దేశాలు ప్రపంచ పటంలో ఎలా ఎదిగాయనే విషయాన్ని సోదాహరణంగా వివరించారు. జిల్లా విద్యాధికారి పీవీజే రామారావు మాట్లాడుతూ ఇటీవల పదవ తరగతి పరీక్షల్లో జిల్లా 82.32 శాతం ఫలితాలను సాధించిందని, 161 మంది విద్యార్థులు షైనింగ్ స్టార్స్ గా నిలిచారని తెలిపారు. ఈసారి రాష్ట్రంలోనే జిల్లా మొదటి స్థానం సాధించాలన్నారు. రిసోర్స్ పర్సన్‌లు గంపా నాగేశ్వరరావు, నండూరి సుబ్బారావు వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ ఇచ్చారు. ఈ ప్రేరణ తరగతుల్లో విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య కె.రాంజీ, రిజిస్ట్రార్ ఉష, ఉపవిద్యాధికారులు, జిల్లాలోని హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

ముగిసిన పాలిసెట్–2025 సర్టిఫికెట్ల పరిశీలన

రేపటి నుంచి వెబ్ ఆప్షన్స్‌కు అవకాశం



విజయవాడ లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సర్టిఫికెట్ల పరిశీలన

మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సాంకేతిక విద్యాశాఖ ద్వారా నిర్వహించిన పాలిసెట్–2025 ప్రవేశ పరీక్షలో ర్యాంకులు పొందిన వారి సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ శనివారంతో ముగిసింది. ఈ నెల 21వ తేదీన మొదలైన సర్టిఫికెట్ల పరిశీలన శనివారం సాయంత్రం ముగిసింది. సర్టిఫికెట్ల పరిశీలన కోసం నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ఆంధ్రా లయోలా డిగ్రీ కళాశాల, మాచవరంలోని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ప్రత్యేకంగా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రవేశ పరీక్షలో పొందిన ర్యాంకుల ఆధారంగా అభ్యర్థులకు తేదీలను కేటాయించి వాటి ప్రకారం సర్టిఫికెట్ల పరిశీలన చేసి వారికి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి అయిన అభ్యర్థులు ఈ నెల 30వ తేదీ సోమవారం నుంచి ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్స్ ఎంపిక చేసుకోవచ్చునని పాలిసెట్–2025 ఎన్టీఆర్ జిల్లా కో–ఆర్డినేటర్ ఎం.విజయసారథి చెప్పారు.

492 మంది సర్టిఫికెట్ల పరిశీలన

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలోని కేంద్రంలో 84 మంది స్పెషల్ కేటగిరీ అభ్యర్థులు, ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలోని కేంద్రంలో 217 మంది, ఆంధ్రా లయోలా కళాశాల ఆవరణలోని కేంద్రంలో 191 మంది సర్టిఫికెట్లను శనివారం పరిశీలించారు. మొత్తం 492 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించి ధ్రువీకరణ పత్రాలను అందజేశామని విజయసారథి చెప్పారు.

కృష్ణాజిల్లాలో...

గన్నవరం: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో తొలిసారిగా నిర్వహించిన పాలీసెట్–2025 కౌన్సెలింగ్ శనివారంతో ముగిసినట్లు కోఆర్డినేటర్ వీవీ కృష్ణమోహన్ తెలిపారు. ఈ నెల 21 నుంచి ప్రారంభమైన కౌన్సెలింగ్‌లో మొత్తం 1,075 మంది అభ్యర్థులు పాల్గొని తమ సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించుకున్నట్లు వివరించారు. కౌన్సెలింగ్ నిమిత్తం కళాశాలలో ఏర్పాటుచేసిన సదుపాయాలపై విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు సంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలిపారు. కౌన్సెలింగ్ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించిన కళాశాల అధ్యాపక బృందం, సిబ్బందిని ఆయన అభినందించారు.

క్లుప్తంగా

భార్యతో వివాదం.. భర్త ఆత్మహత్య

పెనమలూరు: భార్యతో వివాదం కారణంగా మనస్తాపానికి గురైన భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటనపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం గంగూరు మహిళా మండలి కాలువ కట్టకు చెందిన కొక్కిలిగడ్డ నాగేశ్వరరావు(59)రాడ్ బెండింగ్ పనులు చేస్తాడు. అతనికి మద్యం అలవాటు ఉంది. అతను ప్రతి రోజూ మద్యం సేవించి ఇంటికి రావటంతో భార్యతో గొడవలు జరుగుతున్నాయి. ఈ నెల 26వ తేదీ మద్యం సేవించి ఇంటికి రావటంతో భార్య బంధువుల ఇంటికి వెళ్లిపోయింది. దీంతో నాగేశ్వరరావు కలత చెందిన ఎలుకల మందు మద్యంలో కలుపుకొని తాగాడు. అపస్మారకస్థితిలో ఉన్న అతడిని స్థానికుల సమాచారంతో కుటుంబ సభ్యులు విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి కుమారుడు మహేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

'పీఎంజేఏవై' సద్వినియోగం చేసుకోండి



లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని సూచించారు. ఆమె శనివారం లబ్బీపేటలోని మసీదు వీధిలో ఏఎన్ఎంలు నిర్వహిస్తున్న పీఎంజేఏవై ఆన్‌లైన్ విధానాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పలు ఇళ్లకు వెళ్లి ఈ పథకం విధి విధానాలను వివరించడంతో పాటు పొందే లబ్ధిని తెలియజేశారు. తొలుత లబ్బీపేట యూపీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అందులో భాగంగా వైద్యాధికారిని వివిధ ఆరోగ్య కార్యక్రమాల పనితీరును అడిగి తెలుసుకున్నారు. వైద్య సేవల కోసం అక్కడకు వచ్చిన వారితో మాట్లాడి వారి అనారోగ్య సమస్యలు తెలుసుకుని పలు సూచనలు చేశారు. ఫార్మసీలో అందుబాటులో ఉన్న మందులు, రక్తపరీక్షలు నిర్వహిస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీడీమాలజిస్ట్ డాక్టర్ స్నేహ సమీరా, డాక్టర్ భార్గవి, ఆరోగ్యశ్రీ టీమ్ లీడర్ రవి తదితరులు పాల్గొన్నారు.

సాగునీరు విడుదలెప్పుడు ?

- ఇప్పటికే పలుసార్లు వాయిదా
- జూలై నెల వస్తున్నా వదలని సాగునీరు
- గత ప్రభుత్వంలో జూన్ 16లోపు సాగునీరు విడుదల
- ఆలస్యమైతే విపత్తుల భయం



అవనిగడ్డ లాకుల వద్ద పొలాన్ని తలపిస్తున్న పంటకాలువ

అవనిగడ్డ: జూలై నెల వస్తున్నా దివిసీమకు సాగునీరు వదలక పోవడం పట్ల రైతులు ఆందోళన చెందుతున్నారు. మచిలీపట్నం, గుడివాడ, ఏలూరు కాలువలకు ఇప్పటికే సాగునీరు విడుదల చేయగా కేఈబీ కెనాల్‌కు మాత్రం సాగునీటిలో జాప్యం నెలకొంది. సకాలంలో పంటకాలువ పనులు చేయక పోవడం వల్లనే ఈ పరిస్థితి నెలకొందని రైతులు ఆరోపిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రతి ఏడాది జూన్ 18వ తేదీ లోపు దివిసీమకు సాగునీరు వదిలారు. ఇప్పుడు ఎప్పుడు సాగునీరు విడుదల చేస్తారో తెలియని దుస్థితి నెలకొంది.

జాప్యమైతే విపత్తుల భయం..

కేఈబీ కెనాల్ కింద 1.38 లక్షల ఆయకట్టు సాగు భూమి ఉంది. దివిసీమ తీరప్రాంతంలో ఉండటం వల్ల సముద్రానికి దగ్గరగా ఉన్నందున ఏ విపత్తు వచ్చినా ముందుగా నష్టపోయేది ఈ ప్రాంతమే. ఘంటసాల, చల్లపల్లి మండలాల్లో బోర్ల కింద ఇప్పటికే నారుమళ్లు పోసిన రైతులు పంటకాలువల్లో నీటి కోసం ఎదురు చూస్తున్నారు. కొంతమంది రైతులు 20 రోజుల క్రితమే నారుమళ్లు పోశారు. మరో 10 రోజుల్లో పంటకాలువకు సాగునీరు రాకపోతే నారుమళ్లు ముదిరిపోతాయని రైతులు వాపోతున్నారు. ప్రతి సంవత్సరం నవంబర్, డిసెంబర్‌లో వాయుగుండాలు వల్ల భారీ వర్షాలు, తుఫానులు సంభవిస్తుంటాయి. ఆలస్యంగా సాగుచేసిన రైతులు ప్రతి సంవత్సరం ఈ విపత్తులకు ఏదో విధంగా నష్టపోతూనే ఉన్నారు. సాగు ఆలస్యమైతే ఏడాది చివర్లో సంభవించే తుఫాన్లు, భారీ వర్షాల వల్ల పంట నష్టపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పనుల వల్లనే జాప్యమా..

కేఈబీ కెనాల్ పరిధిలోని అన్ని పంటకాలువలు, డ్రెయిన్ల పూడికతీత, గుర్రపు డెక్క, తూడు తొలగింపు కోసం నెల రోజుల క్రితం రూ.2.25 కోట్లు మంజూరయ్యాయి. కొన్ని చోట్ల పనులు పూర్తికాగా, మరి కొన్ని చోట్ల పనులు జరుగుతున్నాయి. ఇంకా కొన్ని ప్రాంతాల్లో పనులు ప్రారంభించలేదు. నిధులు మంజూరు అయిన వెంటనే పనులు ప్రారంభించి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని రైతులు వాపోతున్నారు. కాలువలకు సాగునీరు వదిలిన తరువాత తూతూ మంత్రంగా పనులు చేసి కాంట్రాక్టర్ జేబులు నింపుకునేలా వ్యవహరిస్తున్నారని, అందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరిస్తున్నారని అన్నదాతలు ఆరోపిస్తున్నారు.

రెండో పంటకు ముప్పే..

ఖరీఫ్‌లో వరి పంట సాగు ఆలస్యమైతే రబీలో రెండో పంటగా సాగుచేసే మినుము పంటపై తీవ్ర ప్రభావం చూపుతుందని రైతులు వాపోతున్నారు. ఆలస్యమైతే మినుము పంట మంచు బారిన పడిన పూత, పిందె సరిగా కాయలుగా తయారు కావని, దీనివల్ల దిగుబడులు తగ్గిపోతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ కారణంగా రెండో పంటపైనే ఆశలు పెట్టుకుని సాగుచేస్తున్న కౌలు రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన చెందుతున్నారు.

సాగునీరు వదిలినా ప్రయోజనం లేదు..



కేఈబీ కెనాల్‌లో ఎక్కడా పూడిక తీత పనులు చేయలేదు. కొన్ని చోట్ల రెండు, మూడు అడుగుల మేర మట్టి మేట వేసింది. ఇంకొన్ని చోట్ల పచ్చగడ్డి బాగా పెరిగిపోయింది. ఈ పనులు చేయకుండా సాగునీరు వదిలినా పూర్తిస్థాయిలో నీరురాక రైతులు ఇబ్బందులు పడతారు. ఇన్నాళ్లు ఊరుకుని కాలువకు నీరు వదులుతున్న తరుణంలో పనులు చేయడం వల్ల ప్రయోజనం ఉండదు.

– బీసాబత్తిన ప్రసాద్, మాజీ డీసీ చైర్మన్, నాగాయలంక

4న యువ పారిశ్రామికవేత్తల సదస్సు



లబ్బీపేట(విజయవాడతూర్పు): యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు, వ్యాపార రంగంలో అభివృద్ధిపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో జూలై 4న బిటో ఎక్స్‌పో 2025 నిర్వహిస్తున్నట్లు బిజినెస్ బై బ్రాహ్మణ ట్రస్ట్ వ్యవస్థాపకుడు బుర్రా ఫణిచంద్ర తెలిపారు. గాంధీనగర్‌లోని ఫిల్మ్ చాంబర్‌లో నిర్వహించే ఈ సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను శనివారం లబ్బీపేటలోని ఓ హోటల్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఫణిచంద్ర మాట్లాడుతూ.. మూడు రోజుల పాటు జరిగే సదస్సులో ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొని ప్రసంగిస్తారన్నారు. బ్రాహ్మణ వ్యాపారస్తులు ఇటీవల కాలంలో పలు కంపెనీల ద్వారా జరిగిన అభివృద్ధిని వివరిస్తారని చెప్పారు. బిజినెస్ ప్రదర్శన ఉదయం 10 నుంచి రాత్రి 7 గంటల వరకు జరుగుతుందన్నారు. సదస్సులో ఎలక్ట్రానిక్, సోలార్, బ్యాంకింగ్, ఫైనాన్స్, క్రెడిట్ సొసైటీ, జివెల్, జ్యూట్ బ్యాగ్స్, హెల్త్ అండ్ వెల్ నెస్, రియల్ ఎస్టేట్, బిల్డింగ్ మెటీరియల్, హోమ్ ఆటోమేషన్, కిచెన్ యాక్సరీస్, ఇంటీరియర్, ఈ లెర్నింగ్ తదితర సంస్థలకు చెందిన స్టాల్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి పరిమి గిరిబాబు, సభ్యులు మాజీ మేయర్ జంధ్యాల శంకర్, చెరువు రామకోటయ్య, బసవ రాజు, శ్రీనివాస్, కుందా రామనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి గోపి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గోపి, వేదికపై ఎస్పీ గంగాధరరావు తదితరులు

చిలకలపూడి(మచిలీపట్నం): చట్టాలపై అవగాహన కలిగి ఉండి అవసరం మేరకు మాత్రమే ఉపయోగించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గుట్టాల గోపి చెప్పారు. స్థానిక జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాలులో న్యాయసేవాధికార సంస్థ, జిల్లా పరిపాలనా యంత్రాంగం సంయుక్తంగా నిర్వహించిన నూతన తరహా న్యాయసేవల శిబిరాన్ని శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తితో పాటు కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ ఆర్.గంగాధరరావు, న్యాయమూర్తులు పాల్గొన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి గోపి మాట్లాడుతూ.. ప్రభుత్వానికి, న్యాయవ్యవస్థలకు మధ్య న్యాయసేవాధికార సంస్థ వారధిగా పని చేస్తోందన్నారు. సామాన్యులకు న్యాయం అందుబాటులో ఉంచటం, సాంఘిక దురాచారాలపై పోరాటం, పిల్లల రక్షణ చట్టాలు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తోందని చెప్పారు. వీటితో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందకుండా ఉన్న వారిని గుర్తించి వారికి చేరువ చేసేలా చర్యలు తీసుకుంటుందన్నారు. ఉచితంగా అందించే సేవల పట్ల చులకన భావన కలిగి ఉండవద్దని, మార్పు అవసరమని చెబుతూ న్యాయసేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. చట్టాలు ఉన్నాయి కదా అని స్వార్థం కోసం దుర్వినియోగం చేయకూడదని సూచించారు.

అపరిచితుల ఫోన్‌కాల్స్‌కు స్పందించవద్దు..

కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ.. కోర్టు కేసులకు సంబంధించి న్యాయవాదులను పెట్టుకునే స్థోమత లేని ప్రజలు న్యాయసేవాధికార సంస్థను సంప్రదిస్తే న్యాయవాదిని ఏర్పాటు చేసి ఉచిత న్యాయసహాయం అందిస్తోందన్నారు. లోక్‌అదాలత్ ద్వారా ఎటువంటి కేసులనైనా సత్వరంగా పరిష్కరించుకునే అవకాశం కల్పిస్తోందని చెప్పారు. మాదకద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా, బాల్యవివాహాల నిషేధం తదితర అంశాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. నిత్యం సెల్‌ఫోన్‌తో సమయం గడపటం తగ్గించి పిల్లలతో సమయం కేటాయించాలన్నారు. ఎస్పీ గంగాధరరావు మాట్లాడుతూ మాదకద్రవ్యాలకు సంబంధించిన ఎటువంటి సమాచారానైనా టోల్‌ఫ్రీ నంబర్ 1972 కు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండటంతో పాటు అపరిచితుల ఫోన్‌కాల్స్‌కు స్పందించవద్దని సూచించారు. పలు అంశాలపై న్యాయమూర్తులు మాట్లాడారు. అనంతరం దివ్యాంగులకు వినికిడి పరికరాలు, కుర్చీలు, వాకింగ్ స్టిక్స్ అందజేశారు. వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు.

తొలుత సెయింట్ జాన్స్ ఉన్నత పాఠశాల విద్యార్థుల నాటిక ప్రదర్శన, కళాజాత బృందం ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో న్యాయమూర్తులు ఎస్.సుజాత, బాబునాయక్, జి.వెంకటేశ్వర్లు, ఓ.నాగేశ్వరరావు, కేవీ రామకృష్ణయ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పోతురాజు, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, దివ్యాంగుల సంక్షేమశాఖ ఏడీ రామరాజు, బీసీ కార్పొరేషన్ ఇన్‌చార్జి ఈడీ రాజేంద్రప్రసాద్, జిల్లా ప్రజా రవాణాధికారి వెంకటేశ్వర్లు, డ్వామా పీడీ ఎన్‌వీ శివప్రసాద్ పాల్గొన్నారు.

మందుబాబులకు అడ్డా.. బైపాస్ రోడ్డు



యడ్ల వారి వీధి వద్ద రోడు మధ్యలో మత్తులో పడుకున్న రిక్షా కార్మికుడు



రోడ్డు పక్కనే పడుకున్న ఓ వ్యక్తి



మద్యం మత్తులో తూలుతున్న ఆటోడ్రైవర్

స్థానిక బైపాస్ రోడ్డు మందుబాబులకు అడ్డాగా మారింది. పగలూ.. రాత్రి తేడా లేకుండా మందుబాబులు ఆ మార్గంలో ఎక్కడపడితే అక్కడ మద్యం సేవిస్తూ సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఫుల్‌గా మద్యం పూటుగా సేవించి వెళుతూ... ప్రధాన రహదారులపైనే స్పృహలేకుండా పడిపోతున్నారు. బైపాస్ రోడ్డులో రహదారి పక్కనే మద్యం షాపు ఉండటం వల్ల మద్యం కొనుక్కుని రోడ్డు పక్కనే సిట్టింగులు పెట్టుకుంటున్నారు. ప్రతి రోజు ఆ మార్గంలో తాగుబోతులు వీరంగం చేస్తున్నారు. రహదారుల వెంబడి మందుబాబులు మద్యం సేవించకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

– చల్లపల్లి

సాక్షి సండే క్లాసిఫైడ్స్

Education

■ శ్రీనివాస డిస్టెన్స్ ఎడ్యుకేషన్ 100% పాస్ గ్యారంటీ ISO 9001:2015 Certified. APOSS ద్వారా 10th, Inter, నాగార్జున, ఆంధ్రా యూనివర్శిటీ ద్వారా BA, B.Com, B.Sc, M.Com, MBA, MCA ✆ 99493 08940

HOME TUTIONS

■ Vijayawada Home Tution LKG - 10th Class (CBSE / ICSE / STATE) IIT - JEE / NEET, Intermediate (All Subjects) ✆ 70751 23677

Goods

GOODS

■ XEROX SHOP MACHINERY అమ్మకమునకు కలదు. సంప్రదించండి. ✆ 98857 30003

Real Estate

■ ఇండ్ల స్థలాలు, ఖాళీ స్థలాలు, పొలాలు అమ్మాలన్నా, కొనాలన్నా సంప్రదించండి. ✆ 84999 51666

FLAT FOR SALE

■ గన్నవరం : 3వ ఫ్లోర్ 3 BHK ఫ్లాట్ అమ్మకమునకు కలదు. బుకింగ్స్ ఓపెన్ : 2 BHK ఫ్లాట్స్ పార్కింగ్ + 4 ఫ్లోర్స్ బిల్డింగ్ అమ్మబడును. (ప్రీమియం ఫ్లాట్స్) ✆ 76748 19123

■ 2 BHK Flat in SN Puram,VJA for Sale 24 years old.Around 1350 sq feet including free space.No car parking 8179800259

■ 3 BHK ఫ్లాట్ అమ్మకం, త్రినేత్ర ఎలైట్ విజయవాడ, సత్యనారాయణపురం, శ్రీనగర్ 2nd లైన్లో ఈస్ట్/వెస్ట్/ఫేస్ గృహప్రవేశంనకు సిద్ధంగా ఉన్నవి అమ్మకము. ✆ 98483 94953

■ కానూరు మురళి నగర్ దగ్గర- పార్థ సారథి 5వ రోడ్ నందు 2 బెడ్ రూం రేటుకే 3 బెడ్ రూమ్ ఫ్లాట్,కప్‌బోర్డ్స్ తో కలిపి గృహ ప్రవేశమునకు సిద్ధముగా ఉన్నవి. ✆ 98485 42997

HOUSE FOR SALE

■ నున్నలో SBI బ్యాంక్ సెంటర్కి దగ్గరలో న్యూ ఇండిపెండెంట్ హౌసెస్ 153 & 124 & 72 చ॥ గ॥లలో 2 BHK అమ్మకానికి కలవు. బ్యాంక్ లోన్ సౌకర్యంతో. బిల్డర్ ✆ 93474 47565

PLOT FOR SALE

■ శ్రీ వల్లభనేని ఎస్టేట్స్: రూ. 1,50,000/-కే 100 గజాలు అడ్డంకి దగ్గరలో 10 ఎర్రచందనం మొక్కలతో అమ్మకం. ✆ 81438 82818

■ Vijayawada : Open Plots, Villas, Houses Sale in Gated 319 Acres Community, RERA & APCRDA Approved. ✆ 94946 57244

■ VJA, మంగినపూడి, బందరు రోడ్డు, మచిలీపట్నం, బెంజిసర్కిల్‌కి 6 కిమీ, గన్నవరం ఎయిర్ పోర్టు, కంచికచర్లలో DTCP & AP CRDA ఇళ్ళ మధ్య ప్లాట్స్ చ॥గ॥ 2,900/- నుండి 13,900/- సంప్ర: ✆ 99085 66079

■ మోపిదేవి క్షేత్ర సమీప కోసూరువారిపాలెంలో వెస్ట్ ఫేస్ 17 సెం॥ ఇంటి స్థలం - క్లియర్ టైటిల్ -గ్రామం మధ్య - సిమెంట్ రోడ్స్ - (ఆక్సేలియా ఓనర్) సెల్ : 9912093179, 9177742520

■ విజయవాడ, అయోధ్యనగర్ సాయిబాబా గుడి దగ్గరలో 3, 4 లైన్ల మధ్యన 193 చ.గ.లు (తూర్పు 43', ఉత్తరం 39') ఖాళీ స్థలం అమ్మబడును. సెల్: 93463 69077, 89190 50128

■ విజయవాడ,కొండపల్లి మున్సిపాలిటీ, ఖిల్లా రోడ్‌లో 205 చ॥గ॥ డెవలప్ ప్లాట్, కాంపౌండ్ వాల్, బోర్, చెట్లు, ఉన్నప్లాట్ అమ్మబడును ✆ 984915 2902

FOR SALE / RENT

■ అనంతపురం జిల్లా, గుత్తి-గుంతకల్ మధ్యన @ పాతకొత్తచెరువు, బళ్ళారి - నెల్లూరు నేషనల్ హైవే కి రోడ్డు టచ్, ఒక్కొక్కటి 100×100 కొలతలు గల 3 ఓపెన్ ప్లాట్స్-1 షెడ్డు, దాబా హోటల్స్ / గోడౌన్స్ / వర్క్ షాప్స్ కి లీజ్ / రెంట్ కు లేదా అమ్మకమునకు కలవు. సెల్: 94499 86123, 93470 39123

LEASE / RENT

■ VJA BRTS రోడ్డుకి తూర్పు ఉత్తరం కార్నర్ 1 & 2 ఫ్లోర్స్ ఒక్కో ఫ్లోర్ 1800 చ.అ. బిల్డింగు హాస్టల్స్, ఆఫీసులకు అద్దెకు సంప్ర॥ ✆ 93939 31799

తాజా వార్తల కోసం లాగాన్ అవ్వండి www.sakshi.com

TO-LET COMMERCIAL

■ హాస్టల్, హాస్పటల్, ఇనిస్టిట్యూట్‌కు 12 బెడ్ రూమ్స్ అటాచ్డ్ బాత్ రూమ్స్‌తో 1st, 2nd ఫ్లోర్స్. ఏలూరురోడ్డు, చుట్టుగుంటసిగ్నల్ వద్ద అద్దెకు 9490511849

Wanted

■ హాస్పటల్ ఆయాలు కావలెను. నివాస వసతి కలదు. బాలాజీ E.N.T. హాస్పటల్. డా. వై. జగన్మోహనరావు, నరసింహారావు నాయుడు వీధి, సూర్యారావుపేట, విజయవాడ – 2. సెల్ : 83318 52719, 91336 63794. ఇంటర్వ్యూ: 10 am – 1 pm.

■ Wanted Teachers. Teachers (Ladies) With U.G or P.G Qualification & Good English && Teacher for Science in High School. CIS-School, VJA-1. Ph: ✆ 81799 90508, 92913 98877

■ ఆటోనగర్ ఏరియాలో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. 8 గంటల డ్యూటీ జీతం : 11,000/- + PF+ESI, 4 వీక్లీ ఆఫ్‌లు. Q : 10th Class ✆ 88014 97437

■ ప్రముఖ ప్రింటింగ్ కంపెనీలో పని చేయుటకు హెల్పర్స్ & ఆటో డ్రైవర్స్ కావలెను. ✆ 99123 41915, 76598 29999

■ ఎలక్ట్రీషన్స్, హెల్పర్స్ కావలెను వయసు 18-30 సం॥ లోపు, హౌస్ వైరింగ్‌లో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత. సంప్ర ✆ 93921 33234

■ VJA చుట్టుగుంటలో స్కూలుకు LKG - X ప్రైమరీ అండ్ సబ్జెక్టు టీచర్లు, ట్యూటర్లు, ఆయాలు కావలెను. QLY: డిగ్రీ/B.Ed. సంప్ర : ✆ 89858 32214

■ VJA అయోధ్య నగర్ లోటస్ ల్యాండ్ మార్కు నందు గల చేయూత మానసిక దివ్యాంగుల శిక్షణ సంస్థలో పని చేయుటకు అనుభవం కలిగిన టీచర్లు కావలెను అర్హత: B.Ed, B.Ed (spl). సంప్రదించండి ✆ 94404 21781

■ కేర్ టేకర్స్, నర్సులు కావలెను. VJAలో ప్రముఖ హోమ్‌కేర్ సర్వీసెస్‌లో ఇంటివద్దనే వుండి పెద్ద వారిని చూసుకొనుటకు అనుభవంగల వర్కర్స్, మంచిజీతం ✆ 99121 15559, 91608 35559

■ విజయవాడ లోని ప్రముఖ హ్యాండ్ రైటింగ్ శిక్షణ సంస్థ నందు వర్క్ చేయుటకు మహిళా టీచింగ్ ఫ్యాకల్టీ కావలెను. సంప్ర॥ ✆ 81436 96679

■ కొండపల్లి IDA నందు ఎలక్ట్రికల్ కంపెనీకి మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌గా అనుభవం లేదా డిప్లొమా వారు కావలెను ✆ 92468 28283

■ ప్యాకేజీ సంస్థలో పని చేయుటకు లేడీ ఇన్‌చార్జ్ - 20 వేలు, లేడీ రిసెప్షనిస్ట్ -15 వేలు కంప్యూటర్ నాలెడ్జ్ కలవారు కావలెను. అర్హత: డిగ్రీ, VJA-7. ✆ 87905 99799

■ Wanted Qualified Teachers for Primary Maths, Science, Social and also P.E.T. Teacher. Salary Based on Experience Ph: 95819 15746

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (AP NO-1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/వంట పని, బేబీ కేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో + వ + జీ 16-18 వేలు. ఏజెంట్ల కమీషన్ 5000/- ✆ 96032 03355, 92814 52843

■ టీచర్స్ కావలెను: జై కిసాన్ స్టీల్ కంపెనీ ఇంగ్లీష్ మీడియం హైస్కూలు, మెయిన్ బజార్, విజయవాడ-1లో Hindi, Maths, PS, NS నిమిత్తము అనుభవం కలిగిన B.Ed Full Time టీచర్స్ కావలెను. ✆ 95057 31014, 79819 94744

■ విజయవాడలోని రియల్ ఎస్టేట్ ఆఫీసు నందు భార్య, భర్తలు, డ్రైవర్లు, ఏజెంట్లు,టెలికాలర్స్,అర్జెంటుగా కావలెను. ✆ 99126 02024,84999 40666

■ విజయవాడ మరియు గుంటూరులలోని మా కన్‌స్ట్రక్షన్ సంస్థ నందు పనిచేయుటకు అర్హత, అనుభవం కలిగిన సివిల్ సైట్ సూపర్ వైజర్స్ మరియు డిగ్రీ అర్హత కలిగి కంప్యూటర్ టాలీ అనుభవం ఉన్న లేడీ అకౌంటెంట్ వెంటనే కావలెను. అనుభవమును బట్టి ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. సంప్ర॥ ✆ 97016 89312

■ సెక్యూరిటీ గార్డ్స్, హౌస్‌కీపర్స్ (M) కావలెను. VJA, కంకిపాడులలో 8, 12 గం॥ డ్యూటీ వ: 40 లోపు, Q: 10th P/F ✆ 94917 71179, 73309 11212

■ విజయవాడలోని ప్రముఖ హాస్పిటల్ నందు పనిచేయుటకు అనుభవం గల మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ (PRO) కావలెను. జూన్ 29 నుండి జూలై 8 మధ్య సా॥ 5-8 గం. మధ్య సంప్రదించగలరు. ఫోన్ : 8886461236, 8074839547

■ రామలింగేశ్వర నగర్,తాడిగడప,కేసరపల్లి, రమేష్ హాస్పిటల్ ఏరియాలలో సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. డ్యూటీ 12 గం. ✆ 96401 41999, 73860 12524

■ విజయవాడ (లోకల్)లోని ప్రముఖ కంపెనీకి ఆఫీస్ బాయ్ కావలెను. సంప్రదించండి. ✆ 91333 99257

■ A Collection Agency wants Banking & NBFC Field Executives & Lady Tele Callers in Vijayawada. DRA& Experience preferred. Ph: 9966774466, 9032231756

■ గుంటూరులోని ప్రముఖ కంపెనీకి కారు డ్రైవర్ కావలెను. కనీసం 10 సం॥ల నుండి 15 సం॥ల అనుభవం కలిగి హై ఎండు కారు నడుపగల డ్రైవర్ కావలెను. సంప్ర॥ ✆ 91333 99257

■ బుక్స్ నందు మోస్ట్ అనుభవం గల DTP ఆపరేటర్స్ కావలెను. జీతం: 25,000/- మరియు ప్రూఫ్ రీడర్స్(M/F) కావలెను. అర్హత ఏదైన డిగ్రీ, జీతం:25,000/-వరకు విజయవాడ ✆ 99631 31354

■ హిందీ టీచర్ కావలెను. శ్రీ హైగ్రీవ ఇంగ్లీష్ మీడియం స్కూల్, పాయకాపురం విజయవాడ. సంప్రదించండి. ✆ 94929 79470

■ Wanted Male Diploma Civil / B.Sc / B.Com Candact to work in Bank Valuer Office VJA / Thiruvuru / Gudiwada. Send Resume. Ph : 95057 99599

■ కష్టపడేవాళ్ళు కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు / పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP&డాక్టర్స్ కావలెను. జీ: 15 వేలు-40 వేలు. ఫ్రీరూం + భోజనం. Hyd. 8317512135

■ మండలాలు జిల్లాలో తక్కువ పెట్టుబడి, అధిక రాబడితో వ్యాపారం. శిక్షణ, మార్కెటింగ్ మద్దతు యువత, మహిళలు, Retd. గృహిణులు. ఫోన్. 93922 79699



గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారులు తెలిపే రీతి క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

'కమిషనర్ అవినీతిని ప్రజలకు వివరిస్తాం'

ఎంఎంసీ మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ



మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నగరపాలకసంస్థ కమిషనర్ సీహెచ్‌వీవీఎస్ బాపిరాజు గతేడాది కాలంగా ప్రజాధనాన్ని పాలకవర్గ అనుమతులు లేకుండా అక్రమంగా ఖర్చు చేస్తూ అవినీతికి పాల్పడుతున్నారని మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ ఆరోపించారు. నగరపాలకసంస్థ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో శనివారం ఆమె కార్పొరేటర్‌లతో కలసి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. కమిషనర్, 13 మంది అధికారులు దాదాపు రూ.50 లక్షలను అడ్వాన్స్‌ల రూపంలో తీసుకుని పనులు చేశారన్నారు. పాలకవర్గం దృష్టిలో పెట్టకుండా, కౌన్సిల్ అనుమతి తీసుకోకుండా ప్రజా ధనాన్ని ఎలా ఖర్చు చేస్తారని ఆమె ప్రశ్నించారు. జమా ఖర్చుల వివరాలు అడిగితే ఏఓ లేరని, సంబంధిత గుమాస్తాలు లేరని సాకులు చెబుతున్నారని మండిపడ్డారు. ఏడాదిగా నగరపాలక సంస్థలో కమిషనర్ ఆధ్వర్యంలో ప్రజాధనం ఎలా లూటీ అయ్యిందో త్వరలోనే నగరంలో గడపగడపకు వెళ్లి ప్రజలకు వివరిస్తామన్నారు. అలాగే కమిషనర్ ఒంటెద్దు పోకడ, అవినీతిపై మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, సీడీఎంఏ, విజిలెన్స్ అండ్ ఎంఫోర్స్‌మెంట్, ఏసీబీ తదితర సంస్థల ఉన్నతాధికారులకు పాలకవర్గం ఫిర్యాదు చేస్తోందని చెప్పారు. సమాచార హక్కు చట్టం ద్వారా అవినీతి బాగోతాన్ని తీసుకుంటామన్నారు.

సమాచారం లేకుండానే ప్రారంభోత్సవాలు..

నగరంలో తనకు, వైఎస్సార్ సీపీ పాలకవర్గ సభ్యులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే ప్రారంభోత్సవ, శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని మేయర్ చెప్పారు. తన 30 ఏళ్ల రాజకీయ జీవితంలో ఇలాంటి పరిస్థితులు చూడలేదన్నారు. ఎన్నికల వరకే రాజకీయాలు కానీ నేడు రాజకీయాలు పూర్తిగా చెడిపోయాయన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో పార్టీలకు అతీతమైన పాలన సాగించారన్నారు. కానీ ఏడాది కాలంగా కూటమి నేతృత్వంలో ఇష్టానుసారంగా పాలన సాగిస్తున్నారన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు మేకల సుబ్బన్న, షేక్ షాహీన, నాయకులు బందెల థామస్‌నోబుల్, మీర్ అస్గర్‌అలీ, గూడవల్లి నాగరాజు, షేక్ మహమ్మద్ సాహెబ్, తిరుమలశెట్టి ప్రసాద్, శీలం బాబ్జీ, నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలోయువకుడి దుర్మరణం



కొడాలి(ఘంటసాల): ఘంటసాల మండలం కొడాలి ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు అందించిన వివరాల మేరకు కొడాలి ఎస్సీ కాలనీకి చెందిన దొండపాటి చిట్టిబాబు(20) ద్విచక్ర వాహనంపై శుక్రవారం రాత్రి సెంటర్ నుంచి ఇంటికి వెళ్తున్నాడు. మార్గం మధ్యలో సైకిల్‌ను తప్పించబోయి బైక్ అదుపు తప్పడంతో చిట్టిబాబు రోడ్డుపై పడిపోవడంతో తలకు తీవ్రగాయమై, అక్కడికక్కడే మృతి చెందాడు. సైకిల్‌పై వెళ్తున్న సత్యం అనే వ్యక్తి గాయపడ్డాడు. స్థానికులు 108 వాహనానికి సమాచారం అందించగా సంఘటనా స్థలానికి వచ్చిన సిబ్బంది సత్యంను మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చిట్టిబాబు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ కె.ప్రతాప్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు చిట్టిబాబు గ్రామస్తులందరితో స్నేహభావంగా మెలగడంతో పాటు జీఎన్నార్ యూత్ ఆధ్వర్యంలో జరిగే సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవాడు. విషయం తెలుసుకున్న బీఎస్పీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు గుంటూరు నాగేశ్వరరావు చిట్టిబాబు భౌతికకాయాన్ని సందర్శించి, నివాళులర్పించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

జాతీయ కబడ్డీ పోటీల రిఫరీగా ఏసురత్నం



ఏసురత్నం

గుడివాడ టౌన్: ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని హరిద్వార్‌లో జరగనున్న అండర్–18 బాలికల మొదటి జాతీయ చాంపియన్‌షిప్ పోటీలకు రిఫరీగా వెన్ననపూడి హైస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయుడు పరిశె ఏసురత్నం ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్‌వై మాధవ్‌కుమార్ శనివారం తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు న్యాయ నిర్ణేతగా ఎంపిక కావడం పట్ల రాష్ట్ర కబడ్డీ సంఘం కార్యదర్శి వై.శ్రీకాంత్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.